సాక్షి
చిత్తూరు
బుధవారం । 1 । జనవరి । 2025



ప్రశ్నిస్తే రుబాబు చేస్తారా ?
జెడ్పీ సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తే రుబాబు చేస్తారా అని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. - IIలో



సీఎం పర్యటనకు ఏర్పాట్లు
సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. - IIలో



వన్య ప్రాణి మృతి
నాయకనేరి రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని జంతువు మృతి చెందడంతో అటవీ అధికారులు పరిశీలించారు. - IIలో

న్యూస్‌రీల్

అంతా మంచి జరగాలి



మాజీమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి



మాజీ మంత్రి రోజా

పుంగనూరు/నగరి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజలకు మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వయంప్రతిపత్తి సాధించడం గర్వకారణం



కళాశాల బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల స్వయంప్రతిపత్తి(అటానమస్) సాధించడం గర్వకారణమని జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. మంగళవారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కళాశాల బ్రౌచర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఉత్తమ ప్రమాణాలు పాటిస్తోందని, మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించడం శుభసూచకమన్నారు. గ్రామీణ ప్రాంతమైన కుప్పంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజుకే దక్కిందన్నారు. అనంతరం ఆయన 2025 సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు ఉన్నారు.

పెనుమూరు రైతులకు ప్రశంసలు



పెనుమూరు రైతులను అభినందిస్తున్న కేంద్ర మంత్రి

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర వ్యవసాయ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింహచౌహాహన్ పెనుమూరు రైతులను ప్రశంసించారు. మంగళవారం తిరుపతిలోని రాస్ విజ్ఞాన కేంద్రంలో రైతుల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమూరు మండలానికి చెందిన జామ సాగు చేసే రైతు పసపల హరికృష్ణారెడ్డి, పూలసాగు రైతు వీరభద్రను కేంద్రమంతి అభినందించారు. జామ సాగు దిగుబడి, రాబడిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పూల తోట సాగు చేసిన రైతు మాట్లాడుతూ తాను ఏటా రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆదాయం పొందుతానని వివరించాడు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ రైతులు పండ్లు, పూలను అద్భుతంగా పండించారని కొనియాడారు. ఈ క్రమంలో భాగంగా జామ రైతు హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని, జిల్లాలోని మామిడి, జామ, టమాటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాస్ కేవీకే డైరెక్టర్ శ్రీనివాసులునాయుడు, శాస్త్రవేత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ చిత్తూరు జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. అనంతపురం జిల్లాలో న్యాయవాది శేషాద్రితో పోలీసులు స్టేషన్‌లో దురుసుగా ప్రవర్తించడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు వదిలారని.. అలాగే హైకోర్టు న్యాయవాది జల్లా సుదర్శన్‌రెడ్డి పట్ల లక్కిరెడ్డిపల్లె పోలీసులు వ్యవహరించిన తీరును న్యాయవాదులు తప్పుబట్టారు. ఈ ఘటనలను నిరసిస్తూ చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులు విధులను బహిష్కరించారు. చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం.. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మార్పు రావాలని ఎన్నో నిర్ణయాలు తీసుకుంటారు. ఆ మేరకు మొదటి రోజు నుంచే ప్రయత్నాలు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. కొత్త ఏడాదిలో అయినా మంచి జరగక పోతుందా అని కోటి ఆశలతో అన్నివర్గాల వారు ఆశిస్తున్నారు. అయితే ఆశలు ఫలించాలంటే ప్రభుత్వ తోడ్పాటు ఉండాలి. కొత్త ఏడాదిలో అయినా కూటమి పాలకులకు కనువిప్పు కలిగి ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



తిరుమల ఆలయం ముందు భక్తుల నూతన సంవత్సర సందడి

కొత్తగా.. మొదలయ్యేనా..

- ప్రభుత్వ కొలువులు సాధించడమే లక్ష్యంగా నిరుద్యోగులు
- ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపని ప్రభుత్వాలు
- పంటలు బాగా పండాలని రైతన్నల కోరిక
- ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే బాగుండు
- పీఆర్సీ, అరియర్స్ అందాలని ఉద్యోగుల ఆరాటం
- కూటమి పాలకులకు కనువిప్పు కలిగి మంచి చేయాలని ఆశిస్తున్న జిల్లా ప్రజానీకం
- కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆశిస్తున్న విభిన్న వర్గాల ప్రజలు

కాణిపాకం : కొత్త ఏడాదిలో తమ జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని కోటి ఆశలతో 2025 సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి పాలకులకు కొత్త సంవత్సరంలో కనువిప్పు కలిగి వ్యవసాయానికి అండగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు. ముఖ్యంగా బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారాలని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పంటలసాగుకు అవసరమైన నీటి వసతి ఉన్నా.. పెట్టుబడి సాయం వేధిస్తోంది. దీనికితోడు నకిలీ ఎరువులు, పురుగు మందుల కారణంగా రైతుల చేతికి ఫలం అందడం లేదు. ఈ కష్టాలను అధిగమించేలా రైతులు అడుగులు వేయాలని ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన విషయంలో నిర్లక్ష్యం చూపుతున్న పాలకులు ఇకనుంచైనా మంచి చేస్తారనే ఆశతో చాలామంది నిరుద్యోగులు వేచి చూస్తున్నారు. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నా.. ప్రభుత్వ కొలువు సాధించాలన్న లక్ష్యంతో కోచింగ్ సెంటర్లలో కుస్తీ పడుతున్నారు. అలాగే ఎన్నాళ్లుగానో వేచి చూస్తున్న తమకు అరియర్స్, పీఆర్సీ కల నెరవేరుతుందనే ప్రభుత్వ ఉద్యోగులు ఆశగా ఉన్నారు. మహిళలు ఆర్థిక చేయూత కోసం ప్రయత్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు చేయూత అందిస్తే అన్ని వర్గాలతో పాటు వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు వేలమంది ఎదురు చూస్తున్నారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు నిర్మించే వారికి రాయితీ రుణాలు విరివిగా అందిస్తే.. వారు పలువురికి ఉపాధి అవకాశాలు అందించే దిశగా ఆశావహులు అడుగులు వేస్తున్నారు. విద్యారంగంలో పేద విద్యార్థులకు ప్రభుత్వ సాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కలలు ఈ ఏడాదిలో నెరవేరితే నూతన వెలుగులు ఉంటాయని పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు.



ఆరియర్స్‌పై ఆశలు..



ఉద్యోగులకు కొత్త సంవత్సరంలో తీపి కబురు ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాం. రిటైర్డు, ప్రస్తుత ఉద్యోగులకు ప్రధానంగా ఉన్న సమస్యలు తీరాలని ఆ ఏడుకొండల వాడికి మొక్కులు చెల్లించుకుంటున్నాం. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగుల సాదక బాధలను పట్టించుకుని మావైపు చూడాలి. మా సమస్యలు తీరాలి. అరియర్స్ ఇవ్వాలి. పీఆర్‌సీ చేయాలి. ఈ ఏడాదిలో ఇదే ప్రధానమైన కోరిక.

– రాజరత్నంరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, చిత్తూరు

పోలీస్ కొలువు కోసం..



డీగ్రీలో బీకాం కంప్యూటర్స్, బీఈడీ పూర్తి చేశా. నాకు పోలీస్ ఉద్యోగం అంటే ఇష్టం. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్ పడినప్పుడు నేను దరఖాస్తు చేసుకున్నా. పరీక్షలో ఉత్తీర్ణత సాధించా. ఇక ఈనెల 9వ తేదీన దేహదారుఢ్య పరీక్ష ఉంది. ఇక్కడ నెగ్గితే, మెయిన్స్‌లోనూ సత్తా చాటుతా. నా కుటుంబంలో కొత్త కళను తీసుకొస్తా. పోలీసు కావాలనే కోరిక ఈ ఏడాది నెరవేరుతుందని భావిస్తున్నా. ఆదేవుడిపై భారం వేశా.

– రాజా, నిరుద్యోగి, తవణంపల్లి

రైతు కడుపు చల్లాగా ఉండాలి..



వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. బోరు బావుల్లో నీళ్లు ఉన్నాయి. పంట పండించేందుకు రైతులకు నీటికి ఢోకాలేదు. వేసిన పంట సక్కగా దిగుబడి వస్తే చాలు. పండే పంట రైతుకు నష్టం మిగల్చకపోతే మేలు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తే రైతులు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ కొత్త సంవత్సరం రైతు కంట కన్నీరును తుడిస్తే చాలన్నది కర్షకుల అభిప్రాయం.

– భానుప్రకాష్, చిత్తూరు మండలం

టీచర్ కావాలని..



డిగ్రీ పాటు డీఎడ్ చేశాను. ఇటీవల టెట్ రాశా. డీఎస్సీ వస్తే కచ్చితంగా పోటీపడతా. ఉద్యోగం సాధిస్తా. లేకుంటే పోలీస్ అవుతా. ఈనెల 4వ తేదీ దేహదారుఢ్య పరీక్ష ఉంది. ఇక్కడ కష్టపడితే మెయిన్స్ పరీక్షలో కచ్చితంగా మార్కులు సాధిస్తా. ఇంట్లో భర్తపై ఆధార పడకుండా సొంత కాళ్లపై నిలబడాలన్నదే తపన. ఈ కొత్త ఏడాది మంచిచేస్తుందని భావిస్తున్నా.

– అరుణకుమారి, నిరుద్యోగి, తవణంపల్లి

పరిశ్రమలు రావాలి



హలం పట్టే రైతుల సంఖ్య తగ్గిపోయింది. దెబ్బకు వ్యవసాయ రంగం పూర్తిగా పడిపోయింది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే రైతాంగం బాగుపడుతుంది. అలాగే జిల్లాలో మామిడి పంట అధిక విస్తీర్ణం సాగులో ఉంది. పనులు దొరక్క చాలామంది కర్ణాటక, తమిళనాడుకు వలస వెళ్లిపోతున్నారు. ఈ కొత్త సంవత్సంలో వలసలు ఆగి సొంతూర్లలో పనులు చేసుకునేలా పరిశ్రమలు, ఫ్యాక్టరీలు రావాలి.

– తరుణ్, ప్రైవేటు ఉద్యోగి, బంగారుపాళ్యం

పిల్లల చదువుకు ఢోకా ఉండకూడదు..



తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సిన పెద్ద ఆస్తి ఏదైనా ఉందంటే అది ఇప్పట్లో చదువు. దాని తర్వాతే మిగతావి ఏవైనా. పిల్లల చదువుల కోసం మేము కష్టపడుతున్నాం. దేవుడి దయ..కటాక్షం ఉంటే ఈ కొత్త సంవత్సరంలో ఆ చదువులకు ఢోకా ఉండకూడదని అనుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంవత్సరంలో అయినా తల్లికి వందన పథకం సాయం అందిస్తే మేలు.

– శిరీష, విద్యార్థి తల్లి చిత్తూరు మండలం

విద్యాభివృద్ధికి చొరవ చూపాలి..



డుడ్డు ఉండే వాళ్లు లక్షలాది రూపాయలు కట్టి చదివిస్తున్నారు. అలా చదువుకోవాలని ప్రతి పేదవిద్యార్థికి ఉంటుంది. ప్రభుత్వం పేద పిల్లల చదువు ఆర్థిక సాయం అందించి భారం లేకుండా చూడాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. ఉన్నత చదువులు చదివేందుకు ఆసక్తి ఉండి..ఆర్థిక స్తోమత లేనివారికి ఆర్థికంగా చేయూత అందించాలి. ఈ కొత్త ఏడాది ప్రభుత్వం ఆ రకంగా అడుగులు వేస్తుందని అనుకుంటాం.

– మిరాకల్ జి.జీఫీ, డిగ్రీ విద్యార్థి, చిత్తూరు

పరువుపోయె కదా..!

తహసీల్దార్ అంటే ఒకప్పుడు ఆ గౌరవమే వేరు. మండలం మొత్తానికి మేజిస్ట్రేట్. వారికి చట్టంలోని నిబంధనలపై అవగాహన ఉండేది. హుందాగా వ్యవహరించాలి. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలు పరిష్కరించాలి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక తహసీల్దార్ అనే మాటకే కొందరు అధికారులు కళంకం తెచ్చిపెడుతున్నారు. అర్హత లేనివారిని రాజకీయ ఒత్తిళ్లతో అందలం ఎక్కిస్తుండడంతో వ్యవస్థ దారి తప్పుతోందనే మాటలు వినిపిస్తున్నాయి.

- జిల్లావ్యాప్తంగా చాలా మండలాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ల పాలన
- అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పనిదే సంతకం కూడా పెట్టరు
- భూ దందాలు.. సెటిల్‌మెంట్లకే ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్: జిల్లాలోని చాలా మండలాల్లో తహసీల్దార్ల వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. రెగ్యులర్ తహసీల్దార్లను నియమించకపోవడం.. ఇన్‌చార్జ్‌లకు పాలన అప్పగించడంతో వారు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుండడంతో రెవెన్యూ శాఖ గాడి తప్పుతోంది. పలు మండలాల్లో రెగ్యులర్ తహసీల్దార్లు ఉన్నప్పటికీ, అధికారపార్టీ నాయకులు రెవెన్యూ వ్యవస్థలో కలుగజేసుకుని వారికి అనుకూలంగా ఉండేవారిని ఇన్‌చార్జ్‌లుగా తెచ్చుకుని ఆయా మండలాల్లో భూ వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేలకు తెలియకుండా పలువురు తహసీల్దార్లు రికార్డుల్లో పెన్ను కూడా పెట్టడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, పెనుమూరు, పలమనేరులో నియోజకవర్గంలో గంగవరం, పెద్ద పంజాణి మండలాల్లో ఇప్పటికీ ఇన్‌చార్జ్ తహసీల్దార్లే పెత్తనం చెలాయిస్తున్నారు.



గంగవరం, పెద్దపంజాణి ఎఫ్ఏసీ తహసీల్దార్లు శివకుమార్, ప్రసన్న(ఫైల్)

ఎక్కడికక్కడ దళారులు..

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పారదర్శకత వహించాల్సిన తహసీల్దార్లలో చాలామంది వ్యక్తిగత లబ్ధి కోసం పాటు పడుతున్నారు. చాలాచోట్ల ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టేందుకు దళారులను నియమించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ దళారులకు కొందరు సిబ్బంది సహకరిస్తుండడంతో రెవెన్యూ వ్యవస్థ అవినీతి ఊబిలో చిక్కుకుంది. చిత్తూరులో తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి గతంలో తిమ్మసముద్రం వద్ద పేదల కోసం కేటాయించిన లేఅవుట్‌లో 12 పాట్లను అమ్ముకుని వెళ్లి.. ఇప్పుడు కలెక్టరేట్‌లోనే పని చేసుకుంటున్నాడు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ జరుపుతుండగా, ఆ అధికారిపై వేటు ఖాయంగా కనిపిస్తోంది.

ఆ ఇద్దరూ బడా తహసీల్దార్లు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో తహసీల్దార్ల గురించి విచారిస్తే పలు పచ్చి నిజాలు వెలుగు చూస్తున్నాయి. గంగవరం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో డీటీగా శివకుమార్, ప్రసన్న పనిచేసే సమయంలో చిత్తూరుకు చెందిన కృష్ణకుమార్‌కు ఓ డీకేటీ భూమిని పట్టాగా మార్చుకునే వ్యవహారంలో పరిచయమైంది.

డీకేటీ విషయంలో రగిలిన చిచ్చు

కీలపట్ల క్రాస్ వద్ద కొంత డీకేటీ, మరికొంత ప్రభుత్వ భూమి ఉండగా, ఆ మొత్తం భూమిలో వెంచర్ వేయాలని కృష్ణకుమార్ ప్లాన్ చేయగా అతనికి శివకుమార్, ప్రసన్న సహకరించినట్టు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కృష్ణకుమార్ రికార్డులను తనకు అనుకూలంగా మార్చుకోవడంతో ఈ అధికారులు ఇద్దరూ అతనిపై కక్ష పెంచుకున్నట్టు సమాచారం.

ఇద్దరూ ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా..

గతంలో చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న శివకుమార్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన పలుకుబడితో గంగవరానికి, అతని స్నేహితుడు ప్రసన్న పెద్దపంజాణి మండలాలకు ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా నియమితులయ్యారు.

డబ్బులు విషయంలోనే గొడవ..

కృష్ణకుమార్ కొన్ని విషయాల్లో మోసం చేశాడని ఈ ఇద్దరు అధికారులకు తెలిసి కోపంతో ఉన్నారు.రెండురోజుల కిందట కృష్ణకుమార్ ఓ బార్‌లో ఉండగా.. తహసీల్దార్లు శివకుమార్, ప్రసన్న అక్కడికే వెళ్లడంతో గొడవ జరిగినట్టు తెలిసింది.

చర్యలు తప్పవు..



రెవెన్యూ వ్యవస్థలో తహసీల్దార్ల ప్రమేయం కీలకం. ప్రజలకు సంబంధించిన పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఎంతటి వాళ్లైనా చర్యలు తప్పవు. కొందరు మద్యం మత్తులో వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ, ఏం చేస్తున్నారో కూడా మరిచిపోతున్నారు. అలాంటి వారిని విధుల నుంచి తప్పించాం. ఇన్‌చార్జ్‌లు ఉన్న చోట త్వరలోనే రెగ్యులర్ తహసీల్దార్లను నియమించడానికి ఆదేశాలు ఇస్తాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, చిత్తూరు

ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ

పుత్తూరు(వడమాలపేట): వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట గ్రామంలో పోలియో వ్యాధిగ్రస్తుడు మునిరత్నంకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. పింఛన్ నగదు మొత్తం రూ.15 వేలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందించాలని, ప్రభుత్వ కార్యాలయ ఆవరణల్లో పంపిణీ చేయకూడాదని అధికారులకు సూచించారు.



అప్పలాయగుంటలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న కలెక్టర్, నగరి ఎమ్మెల్యే

అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

చిత్తూరు అర్బన్: డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కంటే.. ఖజానా నింపుకోవడంపైనే ఫోకస్ పెట్టింది. జిల్లాలో ఉన్న పది మద్యం బార్లు, 104 మద్యం దుకాణాల్లో న్యూ ఇయర్ పేరిట అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం, బుధవారాల్లో మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు, మద్యం బార్లు రాత్రి ఒంటి గంట వరకు తెరుచుకోవచ్చని ఎక్సైజ్ అధికారులు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





పింఛన్ పంపిణీకి వెళ్తుండగా..

ఇద్దరు సచివాలయ మహిళా సర్వేయర్లకు గాయాలు

పుంగనూరు: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేసేందుకు వెళ్తున్న సచివాలయ మహిళా సర్వేయర్లు గాయపడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. మంగళవారం పుంగనూరు మండలంలోని చదళ్ల సర్వేయర్ కీర్తి(23), ఏతూరు సర్వేయర్ శోభారాణి (26) ఇద్దరూ కలసి పింఛన్లు పంపిణీ చేసేందుకు స్కూటీలో బయలుదేరారు. శోభారాణి వాహనం నడుపుతుండగా బైపాస్ రోడ్డులోని కొత్తపల్లె క్రాస్ వద్దకు రాగా మరో బైక్‌పై వచ్చిన నెక్కుంది గ్రామానికి చెందిన చంద్ర(28) వీరి స్కూటీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు గాయపడిన ముగ్గురిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఇద్దరు సచివాలయ మహిళా ఉద్యోగులు స్వల్పంగా గాయపడగా, చికిత్స పొందుతున్నారు.

- కూటమి ఎమ్మెల్యేలకు చురకలంటించిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు
- జెడ్పీ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజన్ హల్‌చల్
- చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం
- ప్రజా సమస్యలపై ధ్వజమెత్తిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి
- వాడీవేడిగా జెడ్పీ సమావేశం

సమస్యలపై ప్రశ్నిస్తే రుబాబు చేస్తారా ?



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ప్రజాసమస్యలను లేవనెత్తిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై టీడీపీ ఎమ్మెల్యేలు రుబాబు చేసేందుకు యత్నించారు. అయితే వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ గురుమూర్తి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీలు కూటమి ఎమ్మెల్యేలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తగా.. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్ సభా మర్యాదలు పాటించకుండా ప్రవర్తించారు.

ప్రజాసమస్యలకు ప్రాధాన్యం ఇవ్వకుండా..

జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశమందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం గందరగోళంగా సాగింది. ప్రజా సమస్యలపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడమే కూటమి ఎమ్మెల్యేలు పనిగా పెట్టుకున్నారు. సమాధానం చెప్పలేక కూటమి ఎమ్మెల్యేలు దారుణంగా వ్యవహరించారు. సమావేశం మొత్తం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను టార్గెట్ చేయడానికే సరిపోయింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి. కానీ చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అన్నిట్లో కలుగజేసుకుని అత్యుత్సాహం ప్రదర్శించారు.

సభ్యుడు కాకపోయినా..రాజన్ తిష్ట..

టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ సభ్యుడు కాకపోయినా జెడ్పీ సమావేశంలో తిష్టవేయడం విమర్శలకు తావిచ్చింది. దీనికితోడు గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో సమావేశానికి రావడంతో జిల్లా పరిషత్ సమావేశం కాస్త టీడీపీ సమావేశంగా మారిపోయింది. అధికారులు మాత్రం మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వ పాలనపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ మండలాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు మండలాల్లో మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ స్కూళ్లకు ప్రహరీలు నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, తిరుపతి డీఆర్‌ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గొంతు నొక్కితే ఊరుకునేది లేదు



స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే సహించేది లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి నియోజకవర్గాల్లోని గురుకుల పాఠశాలల్లో సమస్యలను గుర్తించేందుకు ఎన్ని తనిఖీలు చేశారు ? తీసుకున్న చర్యలేంటో అధికారులు తెలియజేయాలన్నారు. ఇటీవల సత్యవేడు, బీఎన్ కండ్రిగలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

సభలో పలువురు ఇలా..

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బిల్లులను రూ.కోట్లల్లో పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. ఇలాగైతే పేదలకు వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు.
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ రైతు రుణాలు ఆశించిన స్థాయిలో ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వసతులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఏటా ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తుంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఏమిటని విద్యాశాఖ అధికారులకు చురకలంటించారు.
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ సభ్యులు అడిగిన ప్రశ్నలను నమోదు చేసుకోవాలన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధుల సమస్యలను పరిశీలించి సమాధానాలు చెప్పాలని ఆదేశించారు. జనవరి 2 నుంచి పంట నష్ట పరిహార బృందం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటిస్తుందన్నారు.

భయపడేదే లేదు..



కూటమి ఎమ్మెల్యేలు అధికారం ఉంది కదా అని పెత్తనం చెలాయిస్తే భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. ములకలచెరువు, పెద్దమండ్యం మండలాలను కరువు మండలాల జాబితాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు చెప్పిన పనులు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. తంబళపల్లె నియోజకవర్గంలోని పలు మండలాల్లో సర్వసభ్య సమావేశాలు జరగడం లేదని, దీనిపై కోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చినప్పటికీ అధికారుల్లో ఏమాత్రం స్పందన లేదని మండిపడ్డారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 6 సబ్‌స్టేషన్లను ఎందుకు రద్దు చేశారని, రైతులకు ఇవ్వాల్సిన 1,400 ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు.



పుష్పగుచ్ఛాలు, కేకులతో రావద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రజలు, ఇతరులు నూతన సంవత్సరంను పురస్కరించుకుని పుష్పగుచ్ఛాలు, కేకులతో రాకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా ఈ నెల 1వ తేదీ వరకు ప్రభుత్వం సంతాప దినాలను ప్రకటించిందన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలన్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా సంతాపదినాలను అమలు చేయాలన్నారు. ఈ నెల 1వ తేదీన కలెక్టరేట్‌కు అధికారులు, ఇతరులెవరూ పుష్పగుచ్ఛాలు, కేకులతో రాకూడదని కలెక్టర్ వెల్లడించారు.

దేహదారుఢ్య పరీక్షలో 159 మంది అర్హత


ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో జరుగుతున్న కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షల్లో మంగళవారం 159 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో జరుగుతున్న ఈవెంట్స్‌ను ఎస్పీ మణికంఠ పర్యవేక్షించారు. మొత్తం 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 403 మంది హాజరయ్యారు. వీరిలో 159 మంది తదుపరి రాత పరీక్షలకు అర్హత సాధించారు.



పేద విద్యార్థులకు శాపం


కే.నారాయణస్వామి

వెదురుకుప్పం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పేద విద్యార్థులకు శాపంగా మారుతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. మంగళవారం ఆయన జర్మనీ నుంచి సాక్షితో మాట్లాడుతూ తెలుగు మహాసభల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో ఉన్న పేద విద్యార్థులకు ఇంగ్లిషు మీడియం లేకుండా చేయాలన్న నిరంకుశత్వ ధోరణితో ప్రముఖులు వ్యాఖ్యానించడం ఆక్షేపణీయమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల పిల్లలు ఇంగ్లిషు మీడియంలో చదువుతుంటే ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధనను వ్యతిరేకించడంపై మండిపడ్డారు. జస్టిస్ రమణ తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వలేదని అనడంతో పాటు పేద విద్యార్థులకు ఇంగ్లిషు అందకుండా చేయండనేలా పరోక్ష వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా గత ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల దళిత మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మేల్కొని పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వన్య ప్రాణి మృతి

వి.కోట: గుర్తు తెలియని వాహనం ఢీకొని అటవీ జంతువు మృతి చెందిన సంఘటన వి.కోట–పేర్నంబట్ జాతీయ రహదారిలోని నాయకనేరి అటవీ ప్రాంతం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. అటవీ అధికారుల సమాచారం మేరకు వివరాలు ఇలా.. మంగళవారం ఉదయం 4 గంటల సమయంలో జాతీయ రహదారిలో ఓ అటవీ జంతువు మృతి చెంది రక్తపు మడుగులో ఉన్నట్లు వాహనాదారులు గుర్తించారు. చనిపోయింది చిరుత పిల్ల అయి ఉంటుందని అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు ఘటనా స్థలానికి వచ్చేసరికి కళేబరం మాయమైంది. రక్తపు మరకలను గుర్తించి వాటి ఆనవాళ్లను సేకరించినట్లు డీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నాయకనేరి రోడ్డు ప్రాంతాల్లో చిరుతల సంచారం లేదని, చనిపోయింది బావురుపిల్లి అయి ఉంటుందన్నారు. అయితే నాయకనేరి అడవుల్లో చిరుతలు ఉన్నాయని గొర్రెలు, మేకలను అనేక దఫాలు ఎత్తుకెళ్లాయని నాయకనేరి గ్రామస్తులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, పలమనేరు రేంజర్ నారాయణ పరిశీలించారు.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : గుర్తింపు పొందిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న గుర్తింపు పొందిన జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు గడువు పెంచారని తెలిపారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న జర్నలిస్టులకు మాత్రమే పొడగింపు ఉత్తర్వులు వర్తిస్తాయని కలెక్టర్ వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి రైతు మృతి


మృతిచెందిన చలపతి

వి.కోట: ద్విచక్రవాహనంపై మిర్చి బస్తాలను మార్కెట్‌కు వేసుకుని వెళ్తుండగా మూటలు జారి పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన వి.కోట మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చించాండపల్లికి చెందిన చలపతి (50) తన తోటలోని రెండుబస్తాల పచ్చిమిర్చిని బైక్‌పై వేసుకుని వి.కోట మార్కెట్‌కు వస్తుండగా.. వి.కోట–కుప్పం జాతీయ రహదారిలోని అన్నవరం గ్రామ సమీపంలో మూటలు పక్కకు జారిపోయాయి. దీంతో బైక్ అదుపుతప్పడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని సీఐ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి

గంగాధర నెల్లూరు: పుట్టిన పసిపిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన జీడీనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి కూతవేట దూరంలో గుడిసెలో జీవనం సాగిస్తున్న కుటుంబాలను ఆయన సందర్శించి ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దుర్గాదేవి, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

21 మందికి ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న 21 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్ కేడర్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

కారుణ్య నియామకాలు


కారుణ్య నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ పరిధిలో ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవికుమార్‌నాయుడు అందజేశారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో వీరిని జూనియర్ సహాయకులుగా నియమిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. విజయపురం మండలానికి హర్షవర్ధన్, కలకడకు గుణసౌమ్య, చిత్తూరుకు రెడ్డిజ్యోత్స్నను నియమించారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్‌కు, సీఈఓ, డిప్యూటీ సీఈఓ జుబేదా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తారని, ఈ నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పీఎం సూర్యఘర్‌లో నడిమూరులో సోలారైజేషన్ పనులు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, క్షేత్ర పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీఎఫ్‌ఓ భరణి, డీఆర్‌ఓ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న కలెక్టర్

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా టీచర్లు విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు.



